# నిప్పుతో చెలగాటం

మూలం : బొకాషియో

గ్రహణ : అవధాని

మనం ఇతరులను ఏవిధంగా ఎగతాళి పట్టించి అవమానించి ఏడిపిద్దాం అనుకుంటామో, అవి మన పాలనే పడతవి. మనలనే ఇతరులును ఎగతాళి చేస్తారు; అవమానిస్తారు: అపహాస్యం చేస్తారు. ఇదేమీ కొత్త విషయం కాదు. సాధారణంగా జరుగుతున్న విషయమే.

చాలా కాలం క్రిందట ఫ్లారెన్సునగరంలో ఎలీనా అని ఒక యువతి ఉండేది. ఆమె చాలా అందగత్తె. అయితే చిన్నతనంలోనే ఆమె భర్త పోయినాడు. పైగా ఆమెకు తన భర్తద్వారా కావాలిసినంత డబ్బు వచ్చింది. మగవాడు కోరే అందం ఆమెదగ్గర ఉన్నది. సుఖ సముపార్జనకు కావలసిన డబ్బు ఆమెదగ్గర ఉన్నది. ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చు. అహ... అలా చేసుకోలేదు. పోనీ పతివ్రతగా, వితంతువుగా పవిత్రంగా బతుకుతున్నదనుకున్నారా? అదీలేదు. రహస్యంగా ఒక యువకుణ్ని ప్రేమించింది; కామించింది. ఇంకాయేం? రహస్య సమావేశాలు, ప్రేయసీ ప్రియుల కిలకిలారావాలు!

ఎలీనా సంగతి ఇలా ఉండగా పారిస్ విశ్వవిద్యాలయంలో సకలవిద్యా పారంగతుడై రినెరీ అనే వేదాంతి ఫ్లారెన్సుకు వచ్చాడు. రినెరీ చక్కగా చదువుకున్నవాడు. క్షుణ్ణంగా అనేక విషయాలు పరిశీలించినవాడు. తాను సంపాదించిన విద్యనంతా వినియోగించి అపారంగా ధనం సంపాదించాలనే ఆశ అతనికిలేదు. కేవలం వివిధ విషయాలు తెలుసుకునే ఉత్సాహం కారణాననే రినెరీ అన్ని విషయాలు తెలుసుకున్నాడు. పదిమందిలో మంచివాడని పేరు సంపాదించాడు. సభ్యత కలవాడు. కీర్తి ప్రతిష్టలు కలవాడు. పాపం ఈ విద్యావంతుడు ఎలీనాను కామించాడు, ప్రేమించాడు. పండితులకూ విద్యావంతులకూ ఇది సహజమేగదా!

ఒక రోజున ఫ్లారెన్సు నగరంలో ఒక గొప్ప విందు జరిగింది. ఆ విందులో రినెరీ ఎలీనాను చూచాడు. వితంతువుకు తగిన దుస్తులను వేసుకున్నది ఎలీనా. అయినా చంద్ర బింబంలాంటి ఆమె ముఖం, మాలతీ లతవంటి ఆమె శరీరం, గుండ్రటి ఆమె కళ్ళు తుమ్మెద రెక్కలవంటి ఆమె కనుబొమ్మలు దొండ పండ్లవంటి ఆమె పెదవులు ఆమె విలాసం చూచి రినెరీ సమ్మోహితుడైనాడు. ఆమె ముందు రంభా ఊర్వసులు బలాదూరు అనుకున్నాడు రినెరీ. విధినిర్ణయం వలన ఆమెను భార్యగా చేపట్టినవాడు అదృష్టవంతుడనుకున్నాడు రినెరీ. ఆమెను క్రీగంట చూసాడు. ప్రకృతిలో ఎన్నో సుందరమైన వస్తువులున్నవి. కష్టపడకుండా అవేమీ సులభంగా మనకు అందవని రినెరీకి తెలుసు. కనుక ఈ ఎలీనాను తనదిగా చేసుకొనటానికి ఎన్ని కష్టాలయినా సరే పడవలసిందే నని రినెరీ నిశ్చయించుకున్నాడు.

రినెరీ అవస్థ అలాఉంది. ఇక ఎలీనాసంగతి చూద్దాం. వితంతువునుగదా అనో, మాగ్ధనుగదా అనో, ఎలీనా ఎప్పుడూ తలవంచుకుని కూర్చోదు. అందులోను మగవాళ్ళు తనను చూస్తున్నారని ఏ స్త్రీకి తెలిస్తే ఊరుకుంటుంది కనుక! ఎవరు ఎలా వ్యవహరించినా ఎలీనావంటి స్త్రీ మాత్రం అలా ఎన్నటికీ చెయ్యదు. అందుచేత రినెరీ తనను పదేపదే చూస్తున్నాడని ఎలీనాకు తెలియగానే చిరునవ్వు నవ్వుతూ ఇవాళ నేను లేచినవేళ మంచిది, అని అన్నది. అంతతో ఊరుకున్నదా లేదు. ఆ కాసేపట్లో అనేకసారులు రినెరీవంక ఎలీనా కూడా క్రీగంటిచూపులు విసిరింది. అలాచేస్తే తాను రినెరీని ప్రేమిస్తున్నట్లు రినెరీ అనుకోవాలని ఆమె ఆశయం. తన రూపానికి ముగ్ధులయిన వారిసంఖ్య పెరిగినకొద్దీ, తనమీద మోహంచేత పడిచచ్చే వాళ్ళు ఎక్కువైనకొద్దీ తన అందం పెరుగుతుందని ఆమె విశ్వాసం.

మన రినెరీమాత్రం ఊరుకున్నాడా. తాను నేర్చిన విద్యాసంస్కారాలకు స్వస్తిచెప్పాడు. తన ఆలోచనలన్నింటినీ ఈ ఎలీనామీదనే కేంద్రీకరించాడు. ఏదో ఒక నెపాన ఎలీనా ప్రక్కగా అనేకసార్లు పచారుచేశాడు. అలా చెయ్యటంచేత తనకు రినెరీపట్ల ఎంతో గౌరవం పెరిగినట్లు ఎలీనా కనిపించింది. ఎట్లాయితేనేం మన రినెరీ ఎలీనా చెలికత్తెతో పరిచయం సంపాదించాడు. సమయం కనిపెట్టి రినెరీ సంగతి ఎలీనాకు చెప్తానని ఆమె వాగ్దానంచేసింది. ఈ సంగతి ఎలీనాకు తెలిసింది. ఒక పెద్దనవ్వు నవ్వింది. తన చెలికత్తెతో ఎలీనా ఇలాచెప్పింది. "నీకు రినెరీ కనిపించినపుడల్లా అతణ్ణి నేను ఎంతో ప్రేమించానని చెప్పు. అతనికంటె నేనే ఎక్కువగా ప్రేమించానని చెప్పు. నాకు ఆత్మగౌరవం ఉన్నదని చెప్పు. ఈ సంగతి తనకు తెలియందికాదని చెప్పు." ఆ చెలికత్తె తన యజమానురాలి మాటలు రినెరీకి చేరవేసింది. పారిస్‌లో ఎంతో కష్టపడి సంపాదించుకున్న శాస్త్ర తెలివినీ విస్మరించి రినెరీ ఈమాటలు నమ్మాడు. ఆ మరునాటినుంచీ రినెరీకి ప్రేమపిచ్చి పట్టింది. ఎలీ

నాకు రోజూ ఉత్తరాలు వ్రాసేవాడు. ఏదో ఒక కానుక పంపేవాడు. ఎలీనా వాటినన్నింటినీ అందుకునేది. సమాధానము పంపేది. వాటిలో నిన్ను ఇలా ప్రేమిస్తున్నాను. అలా ప్రేమిస్తున్నాను అనే వివరాలు ఉండేవి కావు. పట్టీ పట్టని సాధారణ విషయాలు మాత్రమే ఆ సమాధానాలలో ఉండేవి. ఆ విధానపండితుడైన రినెరీ ఈ ప్రేమకలాపంలో సతమతమవుతున్నాడు.

చివరికి ఎలీనా ఈ సంగతంతా తన ప్రియునికి చెప్పింది. ఇక వాడిలో ఈర్ష్య అనుమానాల్ను బయలుదేరాయి. వాటిని చల్లార్చవలసిన బాధ్యత ఎలీనామీద పడ్డది. అందుచేత ఎలీనా తన చెలికత్తెద్వారా రినెరీకి ఇలా కబురు చేసింది.

"నాకు తీరిక దొరకటంలేదు. తీరిక దొరికినా నిన్ను కలుసుకునే ఉపాయం కనిపించటంలేదు. క్రిస్మసు పండుగ నాటి సాయంకాలం మాదొడ్లోకిరా. వీలు చూచుకుని నిన్ను కలుసుకుంటాను." ఈమాటలకు రినెరీ అమందానంద మొందాడు.

క్రిస్మసు పండగ రానేవచ్చింది. ఆ పగలల్లా రినెరీ ఎలాగో గడిపాడు. సంజ వేళ ఎలీనా ఇంటికి చేరాడు. దొడ్డి తలుపుదగ్గర ఎలీనా చెలికత్తె రినెరీని ఆహ్వానించింది. అమాంతం తీసుకువెళ్ళి దొడ్లో స్నానాలగదిలో నుంచో పెట్టి, అయ్యా ఇక్కడ ఉండండి. సమయం చూచుకుని మా యజమానురాలు ఇక్కడికి వస్తుంది, అని చెప్పి చెలికత్తె పలాయనం చిత్తగించింది. అది మంచుకురిసే కాలం. స్నానాల గదికి పైన కప్పులేదు. మంచుతోపాటు చలిగాలికూడా వీస్తోంది.

ఇక ఎలీనా తన మామూలు ప్రియుణ్ని వంటగదిలోనికి తీసుకొని వెళ్ళింది. ఇద్దరూ హాయిగా విందుగుడిచారు. ఆ తరువాత తన ప్రియుణ్ని చూచి ఎలీనా ఇలా అన్నది.

"ఈ పండితుడిమీద నాకు ప్రేమ ఉన్నదని నువ్వు అనుమాన పడుతున్నావు కదూ? అసూయపడుతున్నావుకదూ! చూడు ఆయనను నేను ఎలాసత్కరిస్తున్నానో" ఈవిషయం ఏమిటో తెలుసుకోవాలని ఆ ప్రియుడికి ఆతురతగా ఉన్నది. కనుక ఆమె మాటలు చాలా జాగ్రత్తగా విన్నాడు.

పెరటిలో స్నానాల గదిలో రినెరీ మంచులో తడిసిపోతున్నాడు. పైగా చలికి వణికి పోతున్నాడు. ఎలీనా ఆమె ప్రియునితో సహా పడకగదిని చేరుకున్నది. ఆ గది కిటికీలోనుంచి స్నానాల గదిలోని రినెరీని అతనికి కనిపించకుండా చూస్తున్నారు. అప్పుడు ఎలీనా తన ప్రియునితో ఇలా అన్నది. 'వినండి...ఇప్పుడే నాచెలికత్తెను పంపించాను. నువ్వు ద్వేషిస్తున్న ఆ పండితుడు ఆమెతో ఏమి చెపుతాడో విను.'

అక్కడ చెలికత్తె రినెరీకి ఇలా చెపుతోంది. "అబ్బబ్బ ఏంచెయ్యమంటారండి. పాపం మాయజమానురాలు మీకు ఎంత ఇబ్బంది కలిగించిందీ, మిమ్మల్ని ఎన్ని

అవస్థలు పెడుతున్నదీ? ఆమె మాత్రం ఏంచేస్తుంది! ఆమె అన్నగారొకాయన వచ్చాడు. ఆయనతో మాయజమానురాలు అనేక వ్యవహారాలు మాట్లాడవలసి వచ్చింది. దానికేమీ అంతూపంతూ లేకుండా ఉన్నది. ఆయనే మెుకదలడు. మిమ్మల్ని ఎప్పుడెప్పుడు తన బాహువులతో పట్టి బంధిద్దామా అని మాయజమానురాలు ఆరాట పడుతున్నది. మీరు మరోవిధంగా అనుకోరని మాయజమానురాలు మిమ్మల్ని కోరుతున్నది." పాపం మన పండితుడు అదంతా నిజమే ననుకున్నాడు. అంచేత "మరేం ఫరవాలేదు. నన్ను గురించి అనవసరంగా బాధ పడవద్దని ఆమెకు చెప్పు. తీరిక చేసుకుని రమ్మనమను. అయితే సాధ్యమైనంత త్వరగా రమ్మను" అని ఆ చెలికత్తెతో చెప్పాడు.

పడకగది కిటికీదగ్గర పొంచి ఈ సంభాషణంతా వింటున్న ఎలీనా తన ప్రియునితో ఇలా అన్నది. "విన్నావా ఇప్పుడేమంటావు? నేను ఆ పండితుణ్ని ప్రేమించానని అనుమానించావే! అదే నిజం అయితే వాణ్ని అవిధాన మంచులో నానపెట్టి చంపుతానా?" అంతటితో ఆ ప్రియుడి అనుమానం పటాపంచలైంది. వారిద్దరూ రాత్రి చాలా ప్రొద్దుపోయే వరకూ హాయిగా కబుర్లు చెప్పుకుని తమ శృంగార కలాపంలోనికి దిగారు.

మన పండితుడుమాత్రం చలిలో వణికిపోతున్నాడు. కూర్చునేందుకేమీ లేదు. మంచు నిలువునా ముంచేస్తోంది. యెముకలు కొంగర్లు పోతున్నవి. అటూ యిటూ పచార్లుచేస్తే ఈచలి కొంతవరకు తగ్గుతుందని అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు. చీమ చిటుక్కు మన్నా ఎలీనా వస్తోందనీ తలుపు తీస్తోందనీ ఆశపడుతున్నాడు. తన పాలిట ఈ ఎలీనా అన్నగారు ఎక్కడ దాపురించాడని తనలో తాను ఆయనను తిట్టుకుంటున్నాడు.

అర్ధరాత్రయింది. ఎలీనాకు నిద్రపట్టలేదు. తన ప్రియునితో యిలా అన్నది. "చూడూ... నాప్రేమ గొప్పదంటావా? లేక ఈ పండితుని జ్ఞానం గొప్పదంటావా? నీలో రేగిన ఈర్ష్యాగ్నిని ఇప్పుడాయనను వేధిస్తున్న చలి ఆర్పకలిగిందంటావా?"

"ఆ... నా అనుమానం పోయింది. నీవే నా ప్రాణానివి. నీవే సర్వానివీని. నీవే నేను. నేనే నీవు." "అలాఅయితే మరి నా బహుమానం ఏదీ" అన్నది ఎలీనా.

"బహుమానానికేం తక్కువ" అంటూ ఆ ప్రియుడామెపై ముద్దులవర్షం కురిపించాడు. ఇదంతా అయిపోయిన తరువాత యెలీనా తన ప్రియునితో యిలా చెప్పింది. "ఇప్పుడు మనం కొంచెంసేపు బయటికివెళ్ళాలి. ఈ నా క్రొత్తప్రియుడు నాపై ప్రేమ తనలో అగ్నిగా ధగాధగా మండుతోందని నాకు వ్రాశాడు. ఆ మంట యింకా ప్రజ్వలంగా మండుతోందేమో చూచివద్దాం." వాళ్ళిద్దరూ ఇందాకటి

కిటికీవద్దకు వెళ్ళి రెనెరీని చూచారు. పాపం రెనిరీ అటూ ఇటూ పచారులు చేస్తున్నాడు. చలి వణుకుతో నృత్యంచేస్తున్నాడు. ఆ దృశ్యంచూచి యెలీనా తన ప్రియునితో అన్నది గదా "నేను వీణమీదనో ఫిడేలు మీదనో పాడకుండా ఈయనచేత ఏవిధంగా నృత్యం చేయిస్తున్నానో చూచావా? ఇంకొక తమాషా కూడా చేదాం పద. ఆ తలుపు దగ్గరకు వెళదాం. నేను ఆయనతో మాట్లాడతాను. నువ్వుమా సరసం విందువుగాని" అంటూ తన ప్రియుని చెయ్యి పట్టుకుని పెరట్లోని స్నానాలగదివద్దకు తీసుకువెళ్ళింది. పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూవెళ్ళి స్నానాలగది తలుపు మీద తట్టింది.

అంతటితో మన పండితునికి ప్రాణం లేచివచ్చినట్లయింది. ఇక తలుపుతీసితనను లోనికి తీసుకు వెడుతుందిగదా అని సంతోషపడి "త్వరగా తలుపు తియ్యి. చలితో చచ్చిపోతున్నాను" అన్నాడు.

"ఈ మాత్రానికేనా? పారిస్‌లో ఇంకా చలి యెక్కువ. తలుపుతీసి నిన్ను లోపలికి తీసుకు వెళ్ళితే కొంప లంటుకుపోతవి. మా అన్నయ్య రాత్రి అనగా వచ్చి ఇక్కడనే తిష్టవేశాడు. యెంతో తంటాలుపడి ఈవీలు సంపాదించి ఇలారాగలిగాను. ఆయన వెళ్ళగానే నిన్ను లోపలికి తీసుకు వెళతాను. నేను మాత్రం నీకోసం యెంత ఉవ్విళూరుతున్నాననుకున్నావు" అని ఎలీనా అన్నది.

"అలాయితే కాస్త తలుపుతియ్యి. దేనినీడనయినా నుంచుంటాను. ఈ మంచు నన్ను చంపేస్తోంది. దేని పంచనన్నా తలదాచుకున్నా తరువాత నీ యిష్టం వచ్చినంతసేపు వేచి వుంటాను" అని రెనెరీ అన్నాడు. అందుకు సమాధానంగా ఎలీనా అన్నదిగదా "ఈపాడు తలుపు తియ్యటంలో చెవులు బద్దలయేటట్లు కిరకిర లాడుతుంది. ఈ తలుపే తీస్తే మా అన్నయ్యకు మన సంగతి తెలియక తప్పదు. అందుచేత ముందర ఆయనను పంపించి వచ్చి ఈ తలుపు తీస్తాను."

"తక్షణం ఆ పనిచెయ్యి. ఈ చలికి స్పర్శజ్ఞానమే నశించింది. నావళ్ళు కాచుకోటానికి ఒక పెద్దకుంపటినిండా నిప్పులు తయారు చెయ్యి" అని రెనెరీ మొర పెట్టుకున్నాడు.

"ఎబ్బె... నీ ప్రేమ లేఖలలో వ్రాసిందంతా నిజం అయితే నీలో ఇంకా ఎంతో మంట ఉండాలి. అయితే అదంతావట్టి బూటకం అన్నమాట. ఏమైనా నేను వెళుతున్నాను. కాస్త ఓపిక పట్టు." అంటూ యెలీనా తన ప్రియుని చెయ్యి పట్టుకుని తన పడక గదిని చేరుకుంది ఆరాత్రంతా వాళ్ళకు కనుకే పట్టలేదు. ఈ విషయం చెప్పుకుని ఒకటేనవ్వటం మొదలు పెట్టారు. మన రెనెరీని ఒకటే ఎగతాళి పట్టించారు.

పాపం రెనిరీ పరిస్థితి వర్ణనాతీతంగా ఉన్నది. చలికి యెముకలు కొంగర్లు పోయినవి. ఒకసారి కుడి కాలిమీద నుంచోటం, మళ్ళీ ఆ భంగిమ మార్చి యెడం

కాలిమీద నుంచోటం. ఇలా యెన్నిసార్లో చేశాడు. చలికి పండ్లుకూడా ఊడిపోయే టట్లు ఉన్నవి. రెనెరీకి తల తిరిగింది. సంగతంతా తెలిసింది. ఈ చలికాలపు రాత్రులు దీర్ఘంగా ఉన్నందుకు కాలాన్ని తిట్టాడు. చలి ఇంత తీవ్రంగా ఉన్నందుకు గాలిని తిట్టాడు. ఇంత అమాయకంగా వ్యవహరించినందుకు తనను తిట్టుకున్నాడు. యెలా అయినా బయటికి వెళ్ళటానికి మరోదోవ ఉన్నదేమోనని పరకాయించి చూచాడు. అచ్చే లాభంలేకపోయింది. అదొక్కటే దోవ. తనను ఎలీనా ఇంత కఠినంగా శిక్షించిన దాని ఫలితంగా అతని హృదయంలో ప్రతీకారవాంఛ బయలుదేరింది. ఇదివరకు ఆమె ప్రేమను సంపాదించటానికి యెన్ని పన్నాగాలు ఊహించాడో అంతకు పదివేల రెట్లుగా ఆమెపై కక్షతీర్చుకొనటానికి ఉపాయాలాలోచించాడు. రెనెరీ ప్రేమ అంతా ఆవిధంగా ఆమెపై ద్వేషంగా, కోపంగా మారింది. అయినా ఆ రాత్రికి విముక్తిలేదు. తెల్లవారింది. అంతలో ఎలీనా చెలికత్తె పరుగు పరుగున వచ్చి స్నానాల గది తలుపు తీసింది. యెంతో సానుభూతి కలదాని మాదిరిగా "పాపం యెంత అవస్థ పడ్డారండీ, రాత్రి అంతా ఎవళ్ళో ఒకళ్ళు వస్తూనే ఉన్నారు. మా ఎలీనాకు గుక్క తిప్పుకోటానికికూడా తీరిక లేకపోయింది. దీని కంతటికీ కారణం ఏమిటో మీకు తెలుసునుగా. ఇంత జరిగినందుకు మా ఎలీనా ఎంత బాధ పడుతున్నదనుకున్నారూ! అయినా ఇప్పుడు మునుచుకు పోయిందేమిటి లేండి. ఇంకోసారి..."

"పాపం... మీ ఎలీనా మాత్రం ఏం చేస్తుందీ? అక్కడికీ ఎలాగో తీరిక చేసుకుని ఒకసారి నా దగ్గరకు వచ్చి లాలించి పోయింది. నువ్వన్నట్లు ఇప్పుడేం మునుచుకు పోయిందిలే. ఈసారి మేం కలుసుకున్నప్పుడు ఈ ఆనందంలోని కొరత అనుభవించక పోతామా!" అన్నాడు రెనెరీ. నిజానికి ఇప్పుడతనికి ఎంతో కోపం వచ్చింది. అయితే ఆ కోపంతో పాటు అతని బుర్రకూడా సరిగ్గా పనిచేస్తోంది. కనుక తన కోపం పైకి ఏమాత్రం కనిపించనీయక పై విధంగా అన్నాడు. త్వర త్వరగా ఇంటికి వెళ్ళి నిద్రపోయినాడు. నిద్రలేచే సరికి ఎక్కడి యెముకలు అక్కడ బందయినవి.

డాక్టర్లను పిలిపించి అతి శీతలం చేత తనకు ఇంతజబ్బు చేసిందని చెప్పి మందిప్పించుకున్నాడు. కొద్దిరోజులలో పూర్తిగా కోలుకున్నాడు.

యెలీనా పైన తనకు కలిగిన కోపాన్ని ఏమాత్రం పైకి కనిపించనీయక ఆమె పట్ల పూర్వపు ప్రేమనే నటిస్తున్నాడు. తన కచ్చ తీర్చుకొనటానికి తగిన అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. రెనెరీ పంట పండింది. అటువంటి అవకాశమే అతనికి లభించింది.

యెలీనా ప్రేమించిన ప్రియుడు మరో ప్రియురాలు వెంట పడ్డాడు. యెలీనా వంక తిరిగి చూడటంలేదు. పాపం యెలీనా తన హృదయం ఎండిపోయేటట్లు

ఏడ్చింది. ఈ బాధ చూడలేక ఆమె చెలికత్తె యెలీనాకు ఒక ఉపాయం చెప్పింది. రెనిరీ పండితుడు. ఉపాయశాలి. కనుక ఆయనకు ఈ సంగతంతా చెప్పి తగిన ఉపాయం అడిగితే ఏదో ఒక దోవ చూపకపోడని ఎలీనాకు చెప్పింది. ఇటువంటి విషయాలలో రినెరీ సిద్ధహస్తుడని కూడా ఆ చెలికత్తె ఎలీనాకు భరవాసా యిచ్చింది. పిచ్చి ఎలీనా ఈ మాటలన్నీ నమ్మింది. అందుచేత తన సంగతంతా చెప్పి తగిన ఉపాయం తెలుసుకు రమ్మనమని ఆ చెలికత్తెనే రెనెరీ వద్దకు పంపించింది. తను ఆడపోయిన తీర్థం ఈ విధంగా ఎదురు వచ్చినందుకు రినెరీ సంతసించాడు. తను హృదయమిచ్చి ప్రేమించినందుకు అన్ని బాధల పాలుచేసిన ఎలీనాకు తగిన పాఠం నేర్పటానికి ఇదే అదననుకున్నాడు. ఆ చెలికత్తెతో చెప్పాడు గదా "చూడు ఈ విషయంలో అనవసరంగా దిగులు పడవద్దని మీ ఎలీనాకు చెప్పు. ఆమె ప్రియుడు ప్రాణాలతో ఈ మూడు లోకాలలో యెక్కడున్నా ఆమె పాదాల దగ్గరకు పశ్చాత్తాప హృదయంతో చేర్చగలనని చెప్పు. అయితే అది ఎలాసాధ్యం? అందుకు ఏం చెయ్యాలి అనే విషయాలు నేనే ఆమెకు స్వయంగాచెప్పగలనని చెప్పు."

ఆ చెలికత్తె ఎలీనా వద్దకు పోయి ఆ సంగతంతా తెలియచేసింది. వారిద్దరూ ఒక సాంకేతిక స్థలంలో కలుసుకున్నారు. ముఖాముఖిన అనేక విషయాలు మాట్లాడుకున్నారు. ఎలీనాకు మోహంలో యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం నశించింది. ఇదివరకు తాను రెనెరీ పట్ల యెంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరించిందో విస్మరించి తన ప్రేమ గాథనంతా రెనెరీకి చెప్పింది. ఇందుకు తగిన ఉపాయం చెప్పమని ప్రాధేయపడ్డది. అందుకు సమాధానంగా రెనెరీ అన్నాడుగదా "ఎలీనా! పారీసులో నేను నేర్చుకున్న విషయాలలో మాంత్రిక విద్యకూడా ఒకటి. ఇది బహు చెడ్డవిద్య అని నాకు తెలుసు. అందుచేతనే నా స్వంతానికిగాని. పరుల పనులకుగాని ఈ విద్యను యెన్నడూ వాడలేదు. అయితే నీమీద నాకుగల అపార ప్రేమనుబట్టి ఈ విద్యనేకాదు ఇంకా దేన్నయినా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాను. యెవరి అభీష్టం నెరవేరాలో వారే ఈ విధానాన్ని ఆచరించాలి. పైగా సమయస్ఫూర్తి యెక్కువ ఉన్నవారు మాత్రమే ఈ విధానాన్ని ఆచరించాలి. ఒక విషయం గుర్తించు. ఒక పురుషునిచేత ఒక స్త్రీనిగాని ఒక స్త్రీచేత ఒక పురుషుణ్నిగాని ప్రేమింపచేయటం చాల కష్టమైన పని. పైగా ఈ విధానం పైకి కనుపించేటంత తేలికయింది కాదు. మరి నువ్వు దాన్ని ఆచరించగలవో లేదో నాకు తెలియదు."

తెలివి తేటలంతరించి కేవలం ఆరాటం మాత్రమే ద్యోతంకాగా ఎలీనా మధ్యలోనే అందుకుని "మరేం ఫరవాలేదు. అతనిని నేను యెంతగానో ప్రేమించాను ఆ ప్రేమను తిరిగి పొందటానికి ఏపనయినా చేస్తాను. అయితే సమయస్ఫూర్తి అంటున్నారే. అది ఏ విషయంలోనో కొంచెం చెప్పండి" అని అన్నది.

విషనాగులా పసిగట్టిన రెనెరీ ఆమెతో ఇలా చెప్పాడు. "నువ్వు నీ వాణ్నిగా చేసుకో దలచుకున్న యువకుడి ప్రతిమ నొకదాన్ని తయారు చేస్తాను. దాన్ని నీకు పంపిస్తాను. చంద్రుడస్తమించగానే, నీకు తొలిసారి మెలకువ వచ్చినప్పుడు లేచి ఒక నదిలో ఏడుసార్లు స్నానం చెయ్యాలి. తరువాత దిగంబరంగా ఉన్న దానివి ఉన్నట్లుగా, నగ్నంగా, నిర్జనమైన ఒక ఇంటి కప్పు మీదగాని, లేక ఒక చెట్టుమీదగాని, నేను పంపే బొమ్మతో సహా నుంచోవాలి. ఆ తరువాత ఉత్తర దిశకు తిరిగి నేను ఉపదేశించే సూత్రాన్ని ఏడుసార్లు ఉచ్చరించాలి. అప్పుడు నీకు ఇద్దరు గంధర్వ కన్యలు సాక్షాత్కరిస్తారు. నీకు ఏం కావాలని నిన్ను అడుగుతారు. అప్పుడే నీకు సమయస్ఫూర్తి కావాలి. ఒకరి పేరుకు బదులు మరొకరి పేరు చెప్పక నీ ప్రియుని పేరు చెప్పాలి. ఆ గంధర్వ కాంతలు అదృశ్యమైన తరువాత దుస్తులను ధరించి నువ్వు మీ ఇంటికి వెళ్ళవచ్చు. నీకెందుకూ ఆ అర్ధరాత్రికే నీ ప్రియుడు నీ వద్దకు వచ్చి క్షమించమని నీ కాళ్ళ మీద పడతాడు. ఇక ఈ జీవితంలో యెన్నడు నిన్ను వదలిపోడు. నీ గీచినగీటు దాటడు."

యెలీనా చెవులు నిక్కించి ఈ గాథనంతా విన్నది. విని తన ప్రియుడు తిరిగి వచ్చినట్లే భావించింది. సంతోషించింది. అంత ప్రశాంతంగా ఈ గాథను నమ్మింది. అంచేత అన్నదిగదా "ఒస్ ఇంతేకదా. ఈ పని చేయటానికి కావలసిన గుప్త ప్రదేశం ఉండనే ఉన్నది. ఆర్నో నదిని మీరు యెరుగుదురుగా! దాని దగ్గరనే మాది ఒకకోట ఉన్నది. ఈ కాలంలో ఆ ఆర్నో నదిలో స్నానం చెయ్యటం యెంత హాయిగా ఉంటుంది! ఆ తోటలో ఒక నిర్జనమైన స్థూపం కూడా ఉన్నదని గుర్తు. మీరు చెప్పినపని చెయ్యటానికి ఇది చక్కగా సరిపోతుంది." ఈ స్థలం మన పండితుడికి చిరపరిచితం అయినా "యేమోనమ్మా! అక్కడికి నేను యెప్పుడూ వెళ్ళలేదు. మీరు చెప్పిన మాటలనుబట్టి చూస్తే అది ఈ పనికి బాగా తగివున్నదనుకుంటాను. ఇంకా యేం ముహూర్తం చూచి మీ ప్రియుని చీనా రేకు బొమ్మను మీరు ఉపాసించాల్సిన మంత్రమూ పంపిస్తాను. మీ కోరిక నెరవేరిన తరువాత ఈ దాసుణ్ని మాత్రం మరువకండి"

"అబ్బే అలా మరిచేదాన్ని కాను" అన్నది ఎలీనా. తరువాత వాళ్ళిద్దరూ విడిపోయినారు.

మన పండితునికి, రొట్టె విరిగి నేతిలో పడ్డట్లుంది. ఆమె ప్రియుని బొమ్మను ఒక దాన్ని చైనా రేకుతో తయారు చేయించాడు. ఏదో ప్రుక్కిటి గాథ నొక దాన్ని మంత్రంగా వ్రాశాడు. ఆ రెండింటినీ యెలీనాకు పంపించి ఆ మరునాటి రాత్రే తాను చెప్పిన ఉపాసనకు చాలాబాగా ఉందని కబురు చేశాడు. తన జీతగాణ్ణి వెంట పెట్టుకుని యెలీనా చెప్పిన కోట దగ్గరకు రహస్యంగా వెళ్ళాడు. అక్కడ ఒక స్నేహితుని ఇంట్లో పడుకున్నాడు.

ఇక యెలీనా తన చెలికత్తెను వెంట పెట్టుకుని ప్రొద్దుక్రుంకగానే ఆ పాత కాలం నాటి కోటను చేరింది. కోటలో పడుకుని నిద్రపోయినట్లు నటించింది. చెలికత్తెకు బాగా నిద్ర పట్టింది. యెలీనా ప్రక్కనుంచి లేచి ఎవరూ లేరు గదా అని అటూ ఇటూ చూచింది. పడక గదినుంచి బయలుదేరి తోటలోకి వెళ్ళింది. ఎవరైనా తనను చూస్తున్నారేమోనని అటూ ఇటూ పరకాయించి చూచింది. గుడ్డలన్నీ ఊడదీసి ఒక పొదలో దాచింది. ఆ బొమ్మను కావిలించుకుని ఏడుసార్లు అక్కోనదిలో స్నానం చేసింది. తరువాత దిగంబరంగానే ఆ బొమ్మను చేతులలో పట్టుకుని ఆస్థూపం దగ్గరకు వెళ్ళింది. ఆస్థూపానికి మెట్లు లేవు. పైగా అది చాల యెత్తయింది. అంచేత అటూ ఇటూ వెదికింది. అక్కడ ఒక నిచ్చెన కనిపించింది. ఆ నిచ్చెన సహాయంతో ఆ స్థూపం యెక్కింది.

మన రెనెరీమాత్రం సామాన్యుడా. ప్రొద్దు క్రుంకకముందే అతను ఆ తోటలో దూరాడు. ఎలీనాకు కనిపించకుండా ఒక పొదచాటున దాగాడు. అంచేత దిగంబరంగా స్థూపం దగ్గరకు వెళుతున్న ఎలీనాను చూచాడు. ఆమె కళ్ళు, ఆమె స్తనాలు ఆమె పిరుదులు, ఆమె శరీరం రెనెరీకి నాటి అందం కన్న ద్విగుణీకృతంగా కనిపించినవి. ఆమె అందం తాగాడు రెనెరీ. రినెరీయేకాదు ఆ పరిస్థితిలో యెవరున్నా అంతే. అంతలో ఆమె తనను ఆ చలినాటిరాత్రి పెట్టిన యమయాతనలు గుర్తుకు వచ్చినవి. లేకపోతే అమాంతంపోయి ఆమెను కావిలించుకునేవాడు. ఆమె తనను పెట్టినబాధలు గుర్తుకురాగా అతని ప్రేమ అంతా ఇంకిపోయి కచ్చతీర్చుకోవాలి అనే పట్టుదల మాత్రమే మిగిలింది.

ఎలీనా గబగబా స్థూపం యెక్కింది. ఆమె స్థూపం యెక్కగానే రినెరీ పిల్లిలాపోయి ఆ నిచ్చెనను తీసివేసి ఆమె ఏమి చేస్తుందో చూడటానికి పొదమాటున దాగి ఉన్నాడు. పిచ్చి ఎలీనా స్థూపం మీద ఆ బొమ్మతో ఉత్తర దిశకు తిరిగి నిలిచింది. రినెరీ పంపిన మంత్రాన్ని ఏడుసార్లు జపించింది. కాని గంధర్వ కన్యలు రాలేదు. ఇంకా ఒకటి రెండుసార్లు జపించింది. అబ్బే లాభం లేదు.

పైగా తెల్లవార వస్తోంది. అప్పటికి ఎలీనాకు కొంచెం తెలిసి వచ్చింది. తన మీద కచ్చతీర్చుకోవటానికే రెనెరీ ఈ విధంగా తనకు టోపీ వేశాడని. అయితే మాత్రం అదేమొ చలిరాత్రి. ఇదేమొ వసంతం. దానికి దీనికి ఎంతతేడా! పైగా అప్పుడు రాత్రులు చాలాసేపు ఉంటవి. ఇప్పుడు రాత్రి ఇట్టే అయిపోతుంది అని తనను తాను సంబాళించుకున్నది. అలా అనుకుని బాగా తెల్లవారక ముందే ఇంటికి చేరుదామని నిశ్చయించుకుంది. పాపం తీరా స్థూపం దిగుదామని చూస్తే నిచ్చెన లేదు. ఎలీనాకు గుండె ఆగిపోయేటంత పనయింది. మూర్ఛవచ్చింది. మళ్ళీ లేచి కూచుంది. ఏడ్చింది. ప్రలాపించిందగదా "అయ్యో ఇప్పుడు నేనేంచేసేది చుట్టపక్కాలూ ఇరుగు పొరుగూ ఈనా సంగతి తెలుసుకుని ఏమనుకుంటారు. ఊళ్ళో ఇక తల

యెత్తుకుని తిరగటంయెట్లా! నామర్యాద అంతా మట్టిలో కలిసింది. అటు ప్రియుడూ పోయినాడు, ఇటు బ్రతుకూ ఇంత అధ్వాన్నం అయింది. ఇక నేను బ్రతకటం దేనికి" అనుకొని, ఆ స్థూపం మీదనుంచి కింద దూకి చద్దాం అని నిశ్చయించుకుంది. గబగబా అంచు దగ్గరకు పరుగెత్తింది. అంతలో భళ్ళున తెల్లవారింది. ఆ చుట్టుప్రక్కల యెవరన్నా కనిపిస్తారేమో తన దుస్తులు తెప్పించుకుందామని కళ్లు నిక్కరించుకు చూచింది. ఆ స్థూపానికి కొంచెం దూరంలో పచ్చికమీద కనుమొరగిన రినెరీ అప్పుడే లేస్తూ ఎలీనాను చూశాడు.

"ఓహో! ఎలీనాగారూ! గంధర్వకన్యలు ఇంకా రాలేదాయేం?" అన్నాడు.

ఈ మాటలువిని ఎలీనా మళ్ళీ మూర్ఛపోయింది. తన వళ్ళు కనిపించకుండా పిట్టగోడ చాటుకుపోయి దాని కిటికీలోంచి ఏడుస్తూ ఇలా అన్నది.

"ఓ రినెరీ...ఇలారా, నీతో కాస్త మాట్లాడాలి."

రినెరీ వెళ్ళిస్థూపం మొదట్లో నుంచున్నాడు.

అప్పుడు యెలీనా రినెరీని ఉద్దేశించి ఇలా అన్నది.

"రినెరీ నేను పాపిష్టి దాన్ని. ఆ రోజు రాత్రి నిన్ను అవస్థ పెట్టాననుకో. అది చలి రాత్రే అయినా ఇవాళ నేను దిగంబరంగా ఉండటం చేత నేను కూడా నువ్వు పడ్డంత అవస్థా పడ్డాను. ఎముకలు కొంగర్లు పోయినని, శరీరం ముద్ద అయింది. రక్తం గడ్డ కట్టింది. నేను చేసిన దానికి నువ్వు నాకు చేసిన దానికి సరిపోయింది. నిన్ను అలా యాతన పెట్టటమే పొరపాటు. తరువాత నువ్వుచేసిన ఈ తంతులో పడటం అంతకన్నా పొరపాటు. జరిగిందేమొ జరిగింది. అదంతా మరచిపో. నా గుడ్డలు నాకు తెచ్చిపెట్టు. ఇక నేను నీ దాన్ని, నా గౌరవం అంతా నీదే! నా గౌరవం మర్యాద మట్టి పాలయి నలుగురూ నన్ను చూచి నవ్వితే నీకు మాత్రం అప్రతిష్ట కాదూ! నీ విద్యా సంస్కారాలకు తీరని మచ్చ కాదూ! చదువుకున్నవాడివి. నా గుడ్డలు నాకు ఇవ్వు. ఒక రాత్రికి బదులు ఇక అన్ని రాత్రులు నీపాదాల పంజరంలో ఉండి బదులు తీర్చుకుంటాను. త్రాచుపాములను పట్టుకునే గ్రద్ద వానపాముల వెంటబడితే ఎలా ఉంటుంది. నువ్వెక్కడ నేనెక్కడ?"

ఈ మాటలు రినెరీని కొంచెం కదలించినవి. ఆడది. అందులోను అంత అవస్థ పడుతోంది. అంచేత ఆమెచెప్పినట్లు చేద్దాం అని అనుకున్నాడు కాని తీవ్రమైన కచ్చ. ఆ నాటిరాత్రి తనను ఆమె పెట్టిన యమయాతన గుర్తువచ్చినది. ఆమె నిలువునా చచ్చినా తను ఆమెను కనికరించరాదనుకున్నాడు. ఒక్కక్షణం ఆలోచించి అన్నాడు గదా 'ఎలీనాగారూ! ఆ రాత్రి గుర్తుఉన్నాదా. ఆ నాడు నేను తమను ఎంత ప్రార్థించాను? ఎంతగా కాళ్ళా వేళ్ళాపడ్డాను. ఇప్పుడు మీరు కారుస్తున్నట్లా కంటివెంట నీళ్ళు మాత్రం కార్చలేదనుకోండి. ఆనామాటలు మీ

మీద ఏ మాత్రం పని చేయగలిగినా, మంచునించి తప్పించుకోటానికి ఆ రాత్రి మీరు ఏ కొంచెం పంచ చూపించినా, ఇప్పుడు మీకోరిక తప్పక తీర్చి ఉండేవాణ్ణి. నామాటలు వినిమీ కేం చేశారు. మీ ప్రియుడి బాహుపంజరంలో అమాంతం ఇరికారు. ఇప్పుడా ప్రియుడేడీ. ఆయనను పిలవండి. మీ గౌరవాన్ని మీ ప్రేమను తస్కరించాడు గదా! వాటిని కాపాడవలసిన బాధ్యత ఆయనదే. మీకు కాకపోతే ఇంకా ఎవరికి ఆయన సహాయం చేస్తాడు గనుక. పిలవండి, అరవండి, ఆయనే వచ్చి మీబట్టలు తెస్తాడు. నిచ్చెన వేస్తాడు. ఏమండీ ఇప్పుడు ఆలోచించండి. ఆయన పట్ల మీకుగల ప్రేమ గొప్పదా? మీకు గల ఇంగిత జ్ఞానం గొప్పదా? ఈ రెంటిలో ఏది మిమ్మల్ని ఇప్పుడు కాపాడు తుంది? ఇక మీరు నన్ను ప్రేమిస్తా నంటున్నారు. మీ ప్రేమను మీరే దాచుకోండి. ఒక్క రోజు రాత్రితో నాకు తెలిసివచ్చింది. అనేక సంవత్సరాలు పారిసు విశ్వవిద్యాలయం నేర్పలేని విషయాలు ఆఒక్క రోజు రాత్రి నాకు నేర్పింది. మీరే నాకు కావాలని నే ననుకుంటె ఇక్కడ నన్ను అడ్డగించ గలిగిందేదీలేదు. మీరు బ్రతికి ఇంటికి వెళ్ళగలిగితే తిరిగి మీ ప్రియుడికే మీ శరీరం అప్పగించండి. ఇక పోతే నేను చాలా గొప్పవాణ్ణని పొగడి నా చేత మీ పని చేయించుకుందామని చూస్తున్నారు. నేను గ్రద్దనూ కాను. మీరు గువ్వా కాదు. నేను విషనాగును. మీరు ఒక అడవి మృగం. పాత శత్రువుగా మిమ్మల్ని నేను వెంటాడుతాను. పోతే నేను సానుభూతి కలవాణ్ణే అనుకోండి. ఆ సానుభూతికి తమరు ఎంతమాత్రం తగినవారు కారు. నేను కచ్చతీర్చుకుంటున్నాని మీరు అనుకుంటున్నారా! అది ఎంత మాత్రం కానే కాదు. మీరు నాకు చేసిన అవమానానికి నేను కచ్చ తీర్చుకోవాలంటే మిమ్మల్ని చంపాలి. మీ అందానికి ఆశపడి నేను పొరపడ్డాను. ఈ అందం చిర కాలం ఉండదని మీకు తెలియదు. ఒక్క మిమ్మల్నే కాదు. మీవంటి వాళ్ళను వెయ్యిమంది ఆడవాళ్లనుచంపినా నాఅవమానం తీరదు. చదువుకున్న పండితులను, అవమాన పరిచి ఎగతాళి పట్టించటమంటే ఏమిటో కాస్త తెలుసుకోండి. మీరు బ్రతికి బయట పడగలిగితే ముమ్ముందు జాగ్రత్తగా ఉండండి. నావిద్యాసంస్కారాలు అన్నారు. అవి మీకంటే ప్రపంచానికే ఎక్కువగా ఉపయోగిస్తవి. అదంతా ఎందుకూ? కిందకి రావాలని ఉంటే అక్కడి నుంచి ఇక్కడికి ఒక్క దూకుదూక రాదూ? ఏ కాలో చెయ్యో విరుగుతుంది. అప్పుడు నేను చాలా సంతోషిస్తాను గదా. మీకు రానున్న అవమానమూ తప్పుతుందిగదా. నేను చెప్పేది ఇంతకన్న ఏమీ లేదు. దోవచూపించ మన్నారు చూపించాను. అక్కడి నుంచి కిందికి రావటానికి మీరే దోవ వెతుక్కోవాలి."

ఇంత సేపూ ఎలీనా ఏడుస్తూనే ఉన్నది. సూర్యుడు గబగబా పైకి వస్తున్నాడు. వళ్ళు చిటపటలాడుతోంది, రక్తంసలసలా క్రాగుతోంది. ఏడుస్తూనే ఆమె అన్నదిగదా

"ఓరి పాపిష్టుడా! ఆ ఒక్క రాత్రి సంగతి నిన్ను ఇంతగా బాధపెట్టిందా! నాయీ అందంగాని, నా ప్రార్థనగాని నీమీద పనిచేయలేక పోయినవా? నిన్ను నమ్మి నా గుట్టంతా చెప్పనున్నానే. అందువలననేగా నామీద కచ్చతీర్చుకునే అవకాశం నీకు దొరికిందని మరిచిపోకు. నా అందం సంగతి చెపుతాను. నువ్వేం ముసలి ముతకవా? నా అందంచూచి ముగ్ధులయ్యే యువకులు యెందరున్నారో నీకు తెలియని విషయంకాదు. నువ్వుకూడా ఒకప్పుడు నన్ను ప్రేమించావుకదా. అటువంటి నేను అమాంతం ఇక్కడినుంచి కిందపడి చచ్చిపోతే నువ్వు చూడగలవా. కనుక ఫో! నా గుడ్డలు తెచ్చి యివ్వు. ఈ ఎండ నన్ను కాల్చివేస్తోంది."

ఎలీనా మధ్యలో అందుకుంది కాని లేకపోతే రినెరీ ఇంకా చాలా మాట్లాడి ఉండేవాడు కనుక ఈ మాటలు విని రినెరీ యిలా చెప్పాడు "పిచ్చి ఎలీనా! నన్ను నమ్మి నాకీ అవకాశం కలిగించానను కుంటున్నావు. నన్ను ఎందుకు నమ్మావు? నీ ప్రియుడు తిరిగి వస్తాడని నమ్మావు. ఈ అవకాశాన్ని కాకపోతే నేను నీపై పగ సాధించేందుకు వెయ్యి పన్నాగాలు పన్నాను. మరి ఇదే ఎందుకు అవలంబించానంటావా! నీ అంతట నువ్వే నాకు దొరికావు, అంచేత కులాసాగా నీమీద పగ తీర్చుకోదలచి ఈ పన్నాగం పన్నాను. ఒకవేళ నా ప్రయత్నాలన్నీ విఫలమే అయినవి అనుకో. నాకలం ఉన్నది. నలుగురు నీనోట్లో ఊసేలాంటి పద్యాలు వ్రాయగలనని తెలుసుకో. కలాన్ని మించిన కత్తి లేదని నీకు తెలియదు. ఇక నీ ప్రేమ సంగతి. దాన్ని నీవద్దనే దాచుకోమని చెప్పాను. నీకన్నా యువతులున్నారే సీతాకోక చిలకల్లాగా వేషం వేసుకుంటారు. హంసలాగా నృత్యం చేస్తారు అంతేగని మంచి చెడులు బొత్తిగా మీకు తెలియవు. అంచేత మీరు కుర్రాళ్ళ వెంట బడతారు. వాళ్ళు మీ శీలాన్ని చెరుస్తారు. అది వాళ్ళకొక సరదా మాత్రమే, నువ్వు కాకపోతే మరొకదాని వెంట బడతారు. వయసు వచ్చిన స్త్రీలున్నారే వారు తమకు నచ్చిన వాళ్ళను జాగ్రతగా ఎన్నుకుంటారు. యువకులు మీ ప్రేమ సంగతి ఎవరికీ తెలియదనుకుంటారు. పిల్లి కళ్లు మూసుకు పాలు తాగుతూ తనను ఎవరూ చూడలేదనుకుంటుంది. ఈ పట్టణంలో ఎవరి నడిగినా నీసంగతి నీ ప్రియుడి సంగతి చెప్పలేరు. నువ్వు నాకక్కరలేదు. నేను వయోవృద్ధురాల్ని నీకంటె తెలివిగల దాన్ని ప్రేమించాను. మేం కులాసాగా ఉన్నాం. అంచేత నువ్వు చెయ్యగలిగిందేమీ లేదు. అక్కడినుంచి కిందికి దూకు."

ఎలీనా బిగ్గరగా ఏడుస్తూ చెప్పిందిగదా "ఓయి కసాయివాడా! నా యీ మాటలు, నాయీ దుస్థితీ నిన్ను కదలించలేదు, నువ్వెవరినో ప్రేమించానంటున్నావు. ఆమెకూడా ఆడదే. ఆమెకూ ఆత్మగౌరవం, అభిమానం ఉంటవి. వాటిని చూచి అయినా నా గుడ్డలు తెచ్చిపెట్టు. ఈ ఎండ నన్ను కాల్చేస్తోంది."

రినెరీ చిరునవ్వుతో ఇలా అన్నాడు—

'మీ గుడ్డలు యెక్కడ ఉన్నని.'

ఎలీనా చేతితో తన గుడ్డలున్న చోటు చూపించింది. రినెరీ తన జీతగాణ్ని పిలిచి ఆ గుడ్డలను కాపలా పెట్టి ఇంటికి వెళ్ళి హాయిగా తిండితిని పడుకున్నాడు.

ఇక్కడ ఎలీనా సంగతి యెలా ఉందో చూడండి. పైన ఎండ కింద కాళ్ళు కాలుతున్నవి. అలానే ఒక పిట్ట గోడనీడన కూర్చున్నది కాసేపు ఏడుస్తుంది. కాసేపు ఆలోచిస్తుంది.

రినెరీ గుడ్డలు ఇస్తాడని ఆశపడుతుంది. మరుక్షణమే ఆమె ఆశ నిరాశ అవుతుంది. కాళ్ళు మాడిపోతున్నవి. నాలుక పిడుచ గడుతున్నది. నుంచోలేక కూచుంటే గుడ్డలులేక గచ్చు పెనంలా కాలుతోంది. తెల్లటి శరీరం అంతా నల్లగా కమిలి మాడిపోయింది. పైగా అక్కడక్కడ బొబ్బలు, ఈగలు ఆమె చుట్టూ ముసిరినవి. ఆమె అలసినొలసి నిద్రపోయింది. ఈగలు, తేనెటీగలు ఆ బొబ్బలను చిదిపి నెత్తురు తాగుతున్నవి. మిట్టమధ్యాహ్నం అయే సరికి ఎలీనాకు మెలకువ వచ్చింది. చుట్టుప్రక్కల యెవరు కనిపించినా పిలుద్దామని లేచింది. పురుగుగూడా లేదు. అవతల ఆర్నోనది ఘోష. ఆ నదినిచూస్తే ఆమె దప్పిక ఎక్కువవుతోంది. అటు పరుగెత్తుతోంది. ఏడుస్తోంది. తనను తిట్టుకుంటోంది. తన ప్రియుణ్ణి, రినెరీని ఆడిపోసుకుంటోంది. నిన్న రాత్రి ఎలీనా యెలావుంది. దేవకన్యలావుంది. ఆమె అందానికి చీకటికూడా తెలతెల్ల బడింది. ఇప్పుడామె యెలావుంది. నల్లగా అప్పచ్చిలాగా వున్నది.

మధ్యాహ్నం దాటిపోయింది. రినెరీకి నిద్రమెలకువ వచ్చింది. ఎలీనా సంగతి గుర్తుకువచ్చి ఆ తోటకు వెళ్ళి జీతగాణ్ని పంపించి వేశాడు. రినెరీని చూచి ఎలీనా ఇలా చెప్పింది.

"ఓ రినెరీ! ఒక్క రోజు రాత్రి నిన్ను నా స్నాల గదిలో, బంధించి కష్టపెట్టాను. ఇంత యెండలో వంటిమీద గుడ్డలేకుండా నేను మలమల మాడి నల్లబొగ్గు నయ్యాను, సరిపోయింది. పైకిరా నా అంతట నేను చావలేకుండా వున్నాను. నువ్వేచంపు. అదేనీకు ఇష్టంలేకపోతే త్రాగటానికి గుక్కెడు నీళ్ళయినా ఇవ్వు."

ఎలీనా ఎంతఅవస్థ పడుతున్నదో రినెరీ గ్రహించాడు. అయినా అన్నాడుగదా,

"పాపిష్టి ఎలీనా! నిన్ను చంపటం నాపనికాదు, చావదలచుకుంటే నువ్వు చావు, పాపం మంచినీళ్ళు కావాలా? ఆ రోజురాత్రి వళ్ళు కాచుకోటానికి నువ్వు నాకు ఎంత నిప్పు ఇచ్చావు. కాస్త గుర్తుకు తెచ్చుకో."

"ఓరి పిశాచమా! నీకు దయ అనేది ఏ కోశానా లేదా? నీ వాళ్ళనందరిని దుంపనాశనం చేస్తేనువ్వు నాకే శిక్ష వేస్తావు. ఒక పట్టణం అంతా వల్లకాడు చేసిన ద్రోహికి నువ్వేం శిక్ష వేస్తావు? ఈ ఏండలో ఈ విధాన మాడినా నీ హృదయం కరగ లేదే. ఘో ఆడవి మృగం లాగున్నావు. నీకు చావురాదేం? ఆదేవుడికైనా నా మీద దయరాదా? ఓ ప్రభూ నన్ను కరుణించు" అంటూ ఎలీనా ఆ స్థూపం మధ్యపడ్డది.

సాయంకాలం అయింది. ఆమెకు తాను విధించిన శిక్ష చాలునని రినెరీ అనుకున్నాడు. జీతగాడిచేత ఆమె గుడ్డలు పట్టించి ఎలీనా ఇంటికి వెళ్ళాడు అక్కడ తనకు

పరిచితురాలైన చెలికత్తె కనిపించింది. "ఏమమ్మా మీ యజమానురాలు ఏమైంది" అన్నాడు.

"ఏమో ఏమయిందో నాకు తెలియదు. తెల్లవారిలేచి చూసేసరికి ప్రక్కలో లేదు. మీకేమైనా తెలుసునా బాబూ" అన్నది చెలికత్తె.

"పాపిష్టిదానా నీకుకూడా అదే శిక్ష వెయ్యాల్సింది. కాని ఒక్కసంగతి మరచిపోకు. నీ యావజ్జీవితం గుర్తుండేలాగున నిన్ను శిక్షిస్తేనేగాని నేను నన్ను మరచిపోను" అని రినెరీ తన జీతగాడివైపు తిరిగి "ఆ గుడ్డలు దానికి యివ్వరా. అవసరం అయితే పాపం తన ఎలీనాను చూసివస్తుంది" అన్నాడు.

ఆ గుడ్డలుచూచి ఆ చెలికత్తె గుండెలు బాదుకున్నది. ఇంకాయేముంది ఎలీనా చచ్చిపోయిందనుకుంది. ప్రొద్దుక్రుంకే వేళకు ఆ తాతలనాటి స్థూపం దగ్గరకు ఒక సేవకుడు వెళ్ళాడు. స్థూపంమీద యేదో చప్పుడు కావటం వినిపించింది. యెవరదీ అన్నాడు. ఆగొంతు ఎలీనాకు చిరపరిచితం. కనుక వాడి పేరుని పిలిచి నా చెలికత్తెను పిలు అన్నది. వాడు ఆ నిచ్చెనను స్థూపానికి వేస్తూండగా ఎలీనా చెలికత్తె గబగబా పరుగెత్తుకు వస్తోంది. "ఇక్కడున్నారా అమ్మా మీ కోసం మీ వాళ్ళు వెదుకుతున్నారు. మీరు ఇక్కడికి యెలా వచ్చారు" అన్నాడు.

"అరవకు నా గుడ్డలు తీసుకురా" అని ఎలీనా అరచేలోపల చెలికత్తె గబగబా స్థూపం యెక్కింది. నల్లబొగ్గులాగా ఉన్న తన ఎలీనాను చూచి చెలికత్తె హృదయం బద్దలయ్యేటట్లు ఏడ్చింది. చెలికత్తె చెప్పినదాన్ని బట్టి ఈసంగతి ఎవరికీ తెలియదని ఎలీనా అనుకున్నది. ఎలీనా కదలలేదు. మెదలలేదు. కనుక ఆజీత గాడే ఆమెను తన వీపు మీద కిందికి జేర వేశాడు. ఇక ఆమె చెలికత్తె తొందరగా దిగుతూ కాలుజారి కింద పడ్డది. ఒక కాలు విరిగింది. ఈ చెలికత్తె తనను ఇంటికి తీసుకు వెళుతుందని ఎలీనా ఆశపడ్డది. దాని కాలు విరిగింది. మళ్ళీ ఎలీనా లబ్బున ఏడ్చింది. వాళ్ళ ఏడుపు చూడలేక ఆ జీతకాడు కూడా ఏడ్చాడు. తరువాత తన పెళ్ళాన్ని వాళ్ళని తీసుకువచ్చి తన ఇంటికి చేరవేసుకు వెళ్లాడు. ఆరాత్రి అక్కడే ఎలాగో గడిపి మర్నాడు ఎలీనా తన ఇంటికి చేరుకుంది. తన చుట్ట పక్కాలను పిలిపించింది. ఏవోదయ్యాలు పట్టి తను ఇలా అయిపోయిందని వాళ్లకు చెప్పింది. వాళ్ళుకూడా కాసేపు ఏడ్చి డాక్టర్లను పిలిపించారు, వాళ్ళు నానా అవస్థలు పడ్డారు. ఎలీనాకు పెద్ద పెట్టున జ్వరం వచ్చింది. అవన్నీ నయమయే సరికి ఎలీనా అందం అంతా పోయింది. ఇది వరకటి ఎలీనాకు ఇప్పటి ఎలీనాకు పోలికేలేదు. ఆ చెలికత్తెకు ఆకాలు తీసివేశారు. ఈ సంగతి రినెరీకి తెలసింది ఆమె శిక్షకూడా పూర్తయినందుకు సంతోషించాడు. ఎలీనా ఆమె చెలికత్తె బ్రతికున్నంత కాలం ప్రియులను ఏరుకోటంలోను, వారితో సరసాలాడటంలోను చాలా జాగ్రత్తగా వొళ్లు దగ్గర పెట్టుకొని ఉండేవాళ్ళు.